# దృష్టి

మనం రైల్లోనో, బస్సులోనో ప్రయాణం చేస్తున్నప్పుడు మనకంటికి అక్కడక్కడా కొన్ని అపురూపమైన, అరుదైన దృశ్యాలు కన్పిస్తూ ఉంటాయి!

పచ్చటి చెట్ల మధ్య... తెల్లని కుందేలు చెంగు చెంగుమని దూకి పరిగెడ్తున్నప్పుడు.. మనతో పాటు ప్రయాణం చేస్తున్న పిల్లలు "వావ్! కుందేలు పిల్ల ఎంత ముద్దొస్తోందో" అని కేరింతలు కొట్టడం చూస్తాం!

అదే క్షణాన....

"అబ్బ! కుందేలు కూర ఎంత బావుంటుందో?" అని తోటి ప్రయాణికులు లొట్ట లేయడమూ చూస్తూ ఉంటాం.

ఒకే దృశ్యానికి ఒకరు ఒకలా - మరొకరు మరొకలా - స్పందించడం ఎవరి 'దృష్టి-' ఎలాంటిదో స్పష్టం చేస్తుంది!

కొందరు చేసే పనిలో మనకి 'స్థిరదృష్టి' కనిపిస్తుంది! ఏ పనైనా సరే 'అంకిత భావం'తో పూర్తిగా లీనమైచేస్తారు! ఎవరైనా వచ్చి వాళ్ళని పలకరించినా వాళ్ళ మస్తిష్కానికది వెంటనే అందదు! ఎక్కడో - ధ్యాననిమగ్నులై ఏ లోకంలోనో ఉన్నట్టుం టారు. వీళ్ళ దృష్టి అంతా వాళ్ళు చేస్తోన్న పనిమీదే లగ్నమై బాహ్య ప్రపంచాన్ని మరిచిపోతారు ! ఎవరెన్ని విధాల ప్రయత్నించినా - వాళ్ళ ఏకాగ్రతకి భంగం కల్గిం చలేరు ! ఇలాంటి వాళ్ళు ఏదో ఒక కళలో ప్రవేశం సంపాదించి - 'కళాకారులు'గా రాణిస్తారు !

మరికొందరు ఒకవైపు ఒక పని చేస్తూనే మరోవైపు ఎక్కడేమౌతోందీ, ఎక్కడే లోపం జరుగుతోందీ టక్కున 'విహంగ దృష్టి'తో పసిగట్టేస్తారు ! ఏక సమయంలో అనేక విషయాలపై తమ దృష్టిసారించే వీళ్ళు గొప్ప 'అడ్మినిస్ట్రేటర్స్' అవుతారు!

ఇంకొందరు వ్యక్తులది 'అస్థిర దృష్టి'! ఏ పనిమీదా తమ దృష్టిని పట్టుమని పది నిమిషాలైనా నిలుపలేరు ! వీళ్ళకి ఏ పనిలోనూ ఆసక్తిలేక - ఏ గొప్ప పనినీ సాధించలేక - లోకం దృష్టిలో 'అనామకులు' గానే ఉండిపోతారు!

కొంతమంది ఎవరేం చేస్తోన్నా ప్రతి పనినీ 'వక్రదృష్టి'తోనే చూస్తారు - ఎదుటి వాళ్ళు చేస్తోన్న మంచిపనిలో కూడా 'చెడే' వెదుకుతూ - ఏ చిన్న ఆధారం దొరికినా పీకిపోగులు పెడ్తారు! ఎదుటివాళ్ళలో తప్పులెంచడమే పరమావధిగా పెట్టుకునే వీళ్ళని 'రంధ్రాన్వేషకులు' (Cynic) అంటారు.

మరి కొంత మందిది 'స్వకీయ దృష్టి'. ఇలాంటి వారందరూ ఏ విషయాన్నైనా తమ దృష్టితోనే ఆలోచించాలని కోరుకుంటారే తప్ప, ఆ విషయంలో ఎదుటివాళ్ళ అభిప్రాయాల్ని ఈషణ్మాత్రమైనా పరిగణలోకి తీసుకోరు సరికదా తాము పట్టిన కుందేలుకి మూడే కాళ్ళని వాదిస్తూ - 'వితండవాదుల'నిపించుకుంటారు.



*Contd...*

ఒక వ్యక్తిని 'ఒకే కోణం' లోంచి చూసి ఒక అభిప్రాయాన్ని ఏర్పరుచుకునే వ్యక్తిది 'పాక్షిక దృష్టి' అయితే - ఆ వ్యక్తిని 'అన్ని కోణాల్లో'ంచి ఎలాంటి వివక్షకీ, పక్షపాతానికి తావు లేకుండా - విచక్షణతో వీక్షించ గలిగే వ్యక్తిది: '**సమదృష్టి**'.

తను చేస్తోన్న పనిలో ఎదురయ్యే ఒడుదొడుకులను ముందే ఊహించి... తదనుగుణంగా జాగ్రత్తపడే మనిషిది: **దూరదృష్టి**.

ఒక వ్యక్తి వేషభాషల్నిబట్టి ఆ వ్యక్తిని చూసీచూడటంతోనే ఒక అభిప్రాయాన్నేర్పర్చుకుని - ఆ వ్యక్తి మనోవైకల్యాన్ని ఏ మాత్రం చూడలేని వ్యక్తిది: **బాహ్యదృష్టి**.

ఎదుటి వ్యక్తి వ్యక్తిత్వాన్ని తన మనోనేత్రాలతో దర్శించి, ఆ వ్యక్తి అంతరంగాన్నీ అంతర్గత భావాల్నీ చదవగలిగే వ్యక్తిది: **అంతర్దృష్టి**.

ఒక వ్యక్తి అంతర్దృష్టి అతడి 'మానసిక పరిణతి'కి చిహ్నమైతే - అతడి బాహ్యదృష్టి అతడిలోని 'సౌందర్య స్పృహ'కి సంకేతం!

ఏదైనా ఒక సంఘటననో, దృశ్యాన్నో విశ్లేషించడానికీ, సంశ్లేషించడానికి మనిషికి 'సమదృష్టి' అవసరమైతే... తన అలసత్వ కారణంగానో, ఎదుటి వాళ్ళ వెన్నుపోట్ల మూలంగానో సంక్షోభాల్లో చిక్కుకోకుండా.... అనుక్షణం అప్రమత్తంగా ఉండేందుకు 'దూరదృష్టి' అవసరం !

16-09-1995